విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

31న స్పందన

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 31న సోమవారం 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతికదూరం పాటించాలని కోరారు.

1 నుంచి ఫ్లెక్సీల నిషేధం అమలు

విశాలాంధ్ర - భీమవరం : నవంబర్ 1నుండి ఫ్లెక్సీల నిషేధం తప్పని సరిగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలోని సమావేశం మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 1 నుండి అమల్లోకి రానున్న ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నంబరు 1 నుండి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం అమలకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఫ్లెక్సీల నిషేధం విషయమై గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో టాంటాం వేయించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పంచాయతీ, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ఉద్దేశం

విశాలాంధ్ర - నిడమర్రు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలోనూ, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు) అన్నారు. శనివారం నిడమర్రు మండలంలోని రూ.40 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని డి.గోపవరం సచివాలయం పరిధిలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే తోకలపల్లి గ్రామ సచివాలయం పరిధిలో 20 లక్షలు నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జడ్పిటిసి సభ్యులు కోడే కాశీ, ఆయా గ్రామాల సర్పంచులు, వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర -భీమవరం : కార్తీక మాసం పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలకు అక్టోబర్ 30, నవంబర్ 6,13, 20వ తేదీల్లో ప్రతీ ఆదివారం సాయంత్రం 8 గంటలకు భీమవరం, నర్సాపురం, తణుకు తాడేపల్లిగూడెం డిపోల నుండి పంచారామ క్షేత్రాలకి బస్సులు బయలుదేరుతాయని పశ్చిమగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ. వీరయ్య చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచరామ క్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అన్ని ప్రత్యేక చర్యలను తీసుకుందని శీఘ్ర దర్శనం చేయించే ఏర్పాట్లు చేశామన్నారు. ప్రత్యేక రోజుల్లోనే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా భక్తులు కోరితే ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు. పల్లె వెలుగుకు రూ 700, అల్ట్రా పల్లె వెలుగుకు రూ. 800, ఎక్స్ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్సుకు రూ. 1000, సూపర్ లగ్జరీకి రూ. 1,100 చార్జిగా నిర్ణయించామని ఆయన తెలిపారు.

అభ్యసనా సామర్థ్యం పెంచడానికే శిక్షణ

విశాలాంధ్ర-టి.నరసాపురం : విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంచడానికి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి తెలిపారు. స్థానిక మానవవనరుల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కరోన కారణంగా విద్యార్థులు రెండు సంవత్సరాలు పాఠశాలకు దూరమయ్యారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ఉపాధ్యాయులకు నాలుగు రోజులు ట్రైనింగ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రవి కుమార్, కృష్ణారావు, రామాంజిబాబు, రమేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధన చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : కరోనా వల్ల గత రెండేళ్ళపాటు విద్యార్థులు విద్యకు దూరమవటం వల్ల వారిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ ఉపయోగ పడుతుందని మండల విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. లింగపాలెం మండలం శింగగూడెంలో ఈనెల 17 నుంచి 29 వరకు జరిగిన శిక్షణా తరగతులలో 100 మంది ఉపాధ్యాయులకు నూతన విద్యావిధాన బోధనపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణ ఇచ్చిన రీసోర్స్‌పర్సన్స్ తిరుపతి, నాగేశ్వరరావు, బెంజిమెన్, కుమార్ మంగళం కృషిని విద్యాశాఖాధికారి అభినందించారు.

హాస్టల్ విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎస్ సి బాలికలు, బాలురు హాస్టళ్ళలను సందర్శించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్ సి కమ్యూనిటీ హెల్త్ అధికారి జె. విల్సన్ బాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య పరీక్షల్లో 48 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా అందులో ఇద్దరికీ కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు.కంటి వైద్యాధికారి ఐ శ్రీనివాసరావు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు కె సూర్యకళ, హరి, ఎన్ .పాప, ఏ ఎన్ ఎం ఎం. ప్రేమలీల, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సర్పంచ్, వార్డు సభ్యుల పర్యటన

విశాలాంధ్ర - ముదినేపల్లి : సమస్యలు , వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాల అమలు తెలుసుకునేందుకు ముదినేపల్లి గ్రామంలో సర్పంచ్ , వార్డు సభ్యులు పర్యటనను విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి టి విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 31సోమవారం ఉదయం 10 గంటల నుండి సచివాలయం నుండి ప్రారంభించే పర్యటనలో వార్డు సభ్యులు ,ఎంపీటీసీ, గ్రామ ప్రజాప్రతినిధులు , గ్రామస్థాయి అధికారులు , సచివాలయ సిబ్బంది పాల్గొంటారని ఈ గ్రామ పర్యటనలో స్థానిక ప్రజలు తమ సమస్యలు దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

ఏకో టూరిజానికి ప్రాధాన్యం

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో టూరిజం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అడవులు కీలకపాత్ర వహిస్తాయని అందుకే పట్టణ ప్రాంతాల్లో నగర వనం కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా ఏలూరు నగరం సమీపంలోని సత్రంపాడులో గుర్తించిన భూమితోపాటు ప్రత్యమ్నాయంగా మరో ప్రాంతంలో అనువైన భూమిని కూడా గుర్తించి పర్యాటకంగా నగర వనం ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా అటవీశాఖ అధికారిని ఆదేశించారు. కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొల్లేరు పరిధిలోని మాధవరం, ఆటపాక, జాలిపూడి, కలకుర్రు, గుడివాకలంక గ్రామాల్లో పర్యాటకంగా అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా అటవీ అధికారులను ఆదేశించారు. కొరుటూరు, జల్లేరు, ముంజులూరు జలాశయ ప్రాంతాల్లో పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

గుంటుపల్లి ప్రాంతంలో పర్యాటకంగా బుద్ధిజం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఇందుకు అన్ని విభాగాలు సమన్వయంలో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి(టెరిటోరియల్) రవీంద్రధర్మ, సెట్ వెల్ సిఇఓ, జిల్లా పర్యాటక శాఖ అధికారి యం.డి. హెచ్ మెహరాజ్, సామాజిక వన విభాగం డిఎఫ్ఓ యం. హిమ శైలజ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఇఇ యం.వి. రాజారావు, డిప్యూటీ ఈఈ జి.ఎస్.పి. సత్యనారాయణ, డివిజనల్ మేనేజరు సిహెచ్ శ్రీనివాసరావు, జలవనరుల శాఖ డిప్యూటీ ఎస్.ఇ. యం.ఆర్. రమేష్ బాబు, ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ కె. తిమ్మరాజు, ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డివి బాస్కర్, ఎఫ్.ఆర్.ఓ(అటవీశాఖ) ఎస్ కె. ఫిరోజ్, సహాయ పర్యాటక శాఖ అధికారి పట్టాభిరామన్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి తూట్లు

విశాలాంధ్ర - చింతలపూడి : బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీనియర్ నాయకులు బొడా వజ్రం అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం, లౌకికవాదం, ప్రజాస్వామ్యానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతం పేరుతో దాడులు, కుల వివక్షత, మహిళలపై అత్యాచారాలు, ఎస్ సి, ఎస్టి ల పై దాడులు జరుగుతుంటే నియంత్రించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేష్టలుడికి చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ముసుగులో అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్ విస్మరించారన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు. విద్యుత్ మీటర్ల బిగింపు విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో సీపీఐ తరఫున సమస్య పరిష్కారం అయ్యేవరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శులు, పి శేఖర్, తుర్లపాటి బాబు,దొంత కృష్ణ,యస్ కె జాని తదితరులు, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర-కైకలూరు : పోలీసు అమర వీరులకు ఘన నివాళులు అర్పించ వలసిన బాధ్యత పౌరులుగా ప్రతి ఒక్కరిపై ఉందని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వర రావు అన్నారు. పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారి ఆలయ మండపం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాండ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో వుంటున్నారు అంటే ఆది పోలీస్ వ్యవస్థ వల్లే నని దేశ సరిహద్దుల్లో ఆర్మీ జవానులు, నావిక,వైమానిక దళాలు, దేశంలో అంతర్గతంగా రాష్ట్రాలలో పోలీస్ వ్యవస్థ ఉండబట్టే మనం ప్రశాంతంగా జీవించగలుగుతున్నాం అన్నారు. అనంతరం పోలీస్ శాంతియుత ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అంద చేశారు.ఈ కార్యక్రమంలో నాలుగు స్టేషన్‌ల ఎస్ఐలు,గాయత్రి,చల్లా కృష్ణ,తోట రామకృష్ణ, షణ్ముఖ సాయి, ఎంపీపీ అడవి కృష్ణ, జడ్పీటీసీ కురెళ్ల బేబీ, సర్పంచ్ డి. ఎం.నవరత్న కుమారి, మార్కెట్ యార్డ్ చైర్మన్ దండే పుష్పలత,వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్,పోలీస్ సిబ్బంది,మహిళా పోలీసులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

భూమిని రక్షించుకోవాలి

విశాలాంధ్ర - ఏలూరు : జీవనాధారమైన భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని నగర కమిషనర్ షేక్ షాహిద్ అన్నారు. స్థానిక సెయింట్ థెరీసా కాలేజీలో శనివారం నిషేధిత ప్లాస్టిక్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇళ్లలో ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రతి విద్యార్థినీ ,విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల ఇటు భూమి అటు భూమిపై నివసించే జీవరాశులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తొలుత కమిషనర్ షాహిద్ కళాశాల ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ఆర్. మెర్సి, గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ మనోహరి, హెల్త్ అధికారులు డాక్టర్ మాలతి, డాక్టర్ గోపాల్ నాయక్, సిస్టర్ స్టెల్లా ,కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - నూజివీడు టౌన్: ప్లాస్టిక్ రహిత సమాజానికి విద్యార్థులు కృషి చేయాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి, నూజివీడు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రత్తిపాటి విజయలక్ష్మి అన్నారు. క్లీన్ ఇండియా 2.0 కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శనివారం ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, అన్నవరం రోడ్డు, మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారన్నారు. విద్యార్థులు చేసిన సేవ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు, దెందులూరు శాసనసభ్యులు అబ్బయ్య చౌదరి విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబీద్ ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కాంచన, డాక్టర్ భవాని, ప్రసాద్, పృధ్విరాజు పాల్గొన్నారు .

మాతృ, శిశు వైద్యంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : జిల్లాలో మాతృ,శిశు మరణాలకు వైద్య సిబ్బంది ఆలసత్వమే కారణ మని విచారణలో తేలితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమా వేశం మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మాతృ,శిశు మరణాలు సంభవించడానికి గల కారణాలపై జిల్లా కమిటీ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలకు ఆస్కారం లేనివిధంగా వైద్య ఆరోగ్య, స్త్రీ,శిశు సంక్షేమ శాఖల సిబ్బంది పనిచేయాలన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ వైద్య సహాయం అందించాలన్నారు. ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డి ఎం అండ్ హెచ్ ఓ డా.డి. మహేశ్వరరావు, అడిషనల్ డి ఎం అండ్ హెచ్ డా.భాను నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధ, డి సి హెచ్ ఎస్ డాక్టర్ ఎం వీరాస్వామి, ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - ఉండి : ఈనెల 31న ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. ఉండి మండల ముఠా కార్మిక సంఘం సమావేశం శనివారం ఉండి సీపీఐ కార్యాలయంలో సంఘం గౌరవాధ్యక్షులు కలిశెట్టి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భీమారావు మాట్లాడుతూ దేశంలో కార్మిక సంఘాలకు ఏఐటీయూసీ తల్లి లాంటిదని భీమారావు పేర్కొన్నారు. అన్ని కార్మిక సంఘాలు ఎఐటియుసి పతాకాలను ఆవిష్కరించి, సభలు, సమావేశాలు నిర్వహించి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు, సనపల శ్రీను, ముఠా కార్మిక సంఘం నాయకులు పున్నాని వెంకట అప్పారావు,సబ్బాని మురళి,బొడ్డి రమేష్, జక్కంశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వార్షికోత్సవంలో భాగస్వాములుకండి

విశాలాంధ్ర - కామవరపుకోట : ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు కంకిపాటి బుచ్చిబాబు, గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు కార్మిక సంఘాలను కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం వేతనాల కోసం దేశంలో తొలిసారిగా నిర్మించిన ఏకైకకార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. ఏఐటీయూసీ వార్షికోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం మండల కార్యదర్శి కారం దారయ్య అన్ని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వివిధ కార్మిక సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఏఐటీయూసీవివిధ కార్మిక సంఘాల సమస్యల పరిష్కారం కోసం 100 ఏళ్ళ పైబడి నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అన్ని శాఖలో ఏఐటీయూసీ పతాకావిష్కరణ చేసి వాడ వాడలా సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్వాడి, ఆశ, మిడ్ డే మీల్స్ తదితర యూనియన్ నాయకులు కమ్మచిచ్చు రమాదేవి, దాసరి రేవతి, కరటం సీతామహాలక్ష్మి, కారం కుమారి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన ఘనత ఏఐటీయూసీదే

విశాలాంధ్ర-భీమవరం: ఈనెల 31న ఏఐటీయూసీ 103వ ఆవిర్భావ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు యూనియన్లు పెట్టుకునే హక్కు నుంచి కనీసవేతనాలు, నిర్ణీత పనిగంటలు,పి.ఎఫ్,బోనస్ లాంటి అనేక కార్మిక చట్టాలను సాధించి కార్మికులను బానిసత్వం నుంచి విముక్తి చేసిన ఘనత ఏఐటీయూసీ దేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కిలారి మల్లేశ్వరరావు, నాయకులు కిలారి శివ, బంగారు ప్రసాద్, వై.వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శత్రువులు ఒక్కటయ్యారు

విశాలాంధ్ర - లింగపాలెం : ఎమ్మెల్యే ఎలీజా.. సీనియర్ రాజకీయ వేత్త కోటగిరి పాపారావు కలుసుకోవటమే చింతలపూడి నియోజకవర్గంలో ప్రస్తుతం చర్చనీయాంశమయ్యింది. వీరిరువురూ ఒకే పార్టీలో ఉన్నా రాజకీయ విరోధులుగా ఉంటున్నారు. స్థానిక ఎన్నికల్లో పాపారావు సొంత గ్రామమైన కొత్తపల్లిలో ఎమ్మెల్యే వర్గీయులు పాపారావుకు వ్యతిరేకంగా సర్పంచ్, ఎంపిటిసిలను పోటీలో నిలబెట్టారు. లింగపాలెం మండల జెడ్పీటీసీని కొత్తపల్లి నుంచి పోటీలో నిలబెట్టారు. రాజకీయ దురంధురుడైన పాపారావు వర్గీయులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఈ ఎన్నికల్లో జెడ్పీటీసీ హరినాథ్‌రాజ్, ఎంపిటిసిగా జనరల్ స్థానానికి కేటాయించిన ఈ స్థానంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన జెడ్పీటీసీ భార్య శ్రీలలిత వీరిద్దరు భారీ మెజార్టీతో విజయం సాధించారు. తన వర్గీయులను కాదని పోటీకి దిగిన అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు. తన వర్గీయులను కాదని పోటీకి దిగిన అభ్యర్థులు భారీ విజయం సాధించటంతో పాపారావు వర్గీయులు అగ్గిమీద గుగ్గిలంలా అయ్యారు. ఈ రెండు ఎన్నికలకు ముందు సర్పంచ్ పదవిని పాపారావు వర్గీయులే కైవసం చేసుకున్నారు. ఒకప్పుడు జిల్లా పదవులు అనుభవించి రాజకీయ ఉద్దండుడిగా పేరున్న పాపారావు పరిషత్ ఎన్నికల్లో తన సొంత ఊరిలో ప్రత్యర్థులు విజయాలను అందుకోవటంతో ఈయన వర్గీయులు ఆగ్రహంతో ఉన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీగా గెలుపొందిన హరినాథ్‌రాజ్ దంపతులు ఎమ్మెల్యే వర్గీయుల మధ్య ఈ మధ్య కాలంలో వైరం రావటంతో దీనిని ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే ఎలీజా, పాపారావు ఒక్కటయ్యారు. రాజకీయాల్లో మిత్రులూ, శత్రువులు ఉంటారనటానికి, ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పటానికి వీరి కలయిక మరో ఉదాహరణగా చెప్పవచ్చు. దీనిపై చింతలపూడి నియోజకవర్గంలోని రాజకీయ వర్గాలలో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

ఓటర్-ఆధార్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి

విశాలాంధ్ర- నరసాపురం : ప్రతి ఓటును ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఫాజిల్ అన్నారు.శనివారం స్థానిక తహసీల్దార్‌కార్యాలయంలో బిఎల్ఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా, నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. ఓటు హక్కు కోసం ఫారం 6 ను, ఓటు హక్కు తొలగింపు కోసం ఫారం 7, మార్పులు,చేర్పులు,బదిలీల కోసం ఫారం 8ను సమర్పించాల్సి ఉందన్నారు. ఈ ఓట్లకు సంబంధించిన సమస్యలు, సందేశాల నివృత్తి కోసం బిఎల్ఓ లను లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగదేవి, ఆర్ఐలు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు పంచాలి

విశాలాంధ్ర - దెందులూరు : దోసపాడు పేదలకు చెందిన ఎస్సైన్మెంట్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు పేదలు గత 25 ఏళ్ల నుండి కోల్పోయి భూములు కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. పేదల ఓట్లతో గెలిచిన అధికార పార్టీ నేతలు భూస్వాములకు వత్తాసు పలుకుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన పోలీసులే చట్టాలను తుంగలోకి తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ అధికారులు స్పందించలేని పక్షంలో రాబోయే కాలంలో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోరాట నాయకులు పి ఆనంద్ రావు, జాన్ రాజు, నాగేంద్ర లాజర్ మని, మాణిక్యం, సుబ్బలక్ష్మి, లలిత, పావని తదితరులు పాల్గొన్నారు.

అండర్ -19 క్రీడా ఎంపిక పోటీలు

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని పాఠశాలలు, కళాశాలల నుంచి క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ తదితర విభాగాల్లో జట్లు ఎంపిక పోటీలు నారాయణపురం చింతల పాటి బాపిరాజు స్టేడియంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్నాయి. ఈ పోటీల్లో రెండు జిల్లాలో సుమారు 500 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలు నువ్వా నేనా రీతిలో ఇప్పటివరకు విజయం సాధించి ఎంపికైన జట్లు జిల్లా టీమ్ గా గుర్తింపు పొంది త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. పోటీలను చూడడానికి పలు గ్రామాల నుండి ప్రజలు రావడంతో స్టేడియం కిటకిటలాడింది.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యార్థులు

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు స్థానిక అల్లూరి సీతారామ రాజు స్టేడియం నందు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో క్రీడా పోటీలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఉన్నత నగర పాఠశాల విద్యార్థులు తమ విశేష ప్రతిభ కనబరిచారు.విద్యార్థులకు,వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తోట శ్రీనివాస్ కుమార్(పి. ఇ.టి.)కి అభినందన సభ నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ ఆర్.ఎమ్.చౌదరి, ఉపాధ్యాయ బృందం,ఎస్ ఎమ్. సి.చైర్మెన్, ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

కంటి వైద్యులు డాక్టర్ పద్మనాభం మృతి

విశాలాంధ్ర - ఏలూరు : నగరానికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు, హేలాపురి లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ మానం అనంత పద్మనాభం అనారోగ్యంతో అమెరికాలో శనివారం మృతి చెందారు. 1998-99 సంవత్సరంలో ఉమ్మడి లయన్స్ జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించి, జిల్లాలోనే కాక ఇతర జిల్లాలలో సైతం 171 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 16,500 కేటరాక్ట్ ఆపరేషన్స్ లయ నిజం ద్వారా నిర్వహించారు. 1993లో ఏలూరులో అంధ బాలికల పాఠశాల ప్రారంభించారు. 1994 లో వరల్డ్ బ్యాంకు సహకారంతో నిర్వహించిన బ్లైండ్ నెస్ కంట్రోల్ సొసైటీ జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహించారు.2001 లో గవరవరంలోని హేలాపురి లయన్స్ క్లబ్‌లో కంటి ఆసుపత్రి నిర్మించి, ఆరోగ్యంగా ఉన్నంత కాలం ప్రతీరోజు ఉచిత కంటి వైద్య సేవలు, నెలకు ఒకసారి కంటి ఆపరేషన్స్ నిర్వహించారు. పద్మనాభం మృతి సేవారంగానికి ఇతర రంగాలకు తీరనిలోటు అని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి,లయన్స్ జిల్లా నాయుకులు ఎల్. వెంకటేశ్వరరావు, అభినయ నృత్య భారతి వ్యవస్థాపక కార్యదర్శి డి.హేమసుందర్ లు నివాళులర్పించారు.

వీఆర్వో జిల్లా అధ్యక్షునిగా గంగాధరరావు

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షునిగా కలిదిండి గ్రామ రెవెన్యూ అధికారి జి. గంగాధర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్. మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శనివారం స్థానిక రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఏపి జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు.ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులకు ఎటువంటి సమస్య వచ్చినా సంఘటితంగా ఉద్యమించి దాన్ని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.కృష్ణమూర్తి, ఏపి జెఏసి అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి.రావు, ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆర్ వి రాజేష్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కే.రమేష్ కుమార్ ,జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం : ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఏలూరు జిల్లా సహాధ్యక్షులుగా సాల్మన్ రాజు, ఉపాధ్యక్షునిగా కే.చంద్రశేఖర్, కే. ప్రసాద్, ఎం.తారకేష్,ఎస్ కె. అక్బర్ ,ప్రధాన కార్యదర్శిగా ఎస్.మురళీకృష్ణ, సహాయ కార్యదర్శులుగా బి.ఆర్ సుబ్బారావు, టి. రాజారత్నం స్వామి, కె.ప్రసాద్, టి.సుధాకర్, కోశాధికారిగా ఎస్.సింహాద్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, బి. ఏడుకొండలు, వై.వేణుగోపాల్, బి. శివకుమార్ ,క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా భరత్ ,రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రాజాబాబు, ఎ. నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పి.శేఖర్, ఈసీ సభ్యులుగా ఎన్. వకులాదేవి, వీర్రాజు, డివిడి ప్రసాదు, ఆర్. సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ఎన్.ఆర్.ఐ. కళాశాల ఆధ్వర్యంలో క్లీన్ ఇండియా

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : సమీపంలో ఉన్న ఎన్.ఆర్.ఐ. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి దత్తత గ్రామమైన కనసానపల్లిలో శనివారం క్లీన్ ఇండియా క్యాంపెయిన్ 2.0 నిర్వహించారని కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్. వెంకట్రావు తెలిపారు. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని వాటిని ప్లాస్టిక్ రహితంగా మార్చాలనేదే ముఖ్య ఉద్దేశ్యమ న్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి. నాగభాస్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కనసానపల్లి గ్రామ ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పంచాయతీ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కృషికి, శ్రమకు మెచ్చి కనసానపల్లి గ్రామ సర్పంచి సంజీవయ్య విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.యస్.యస్. విభాగాధిపతి కె. రాగసాయి, సివిల్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఏలూరు : విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా స్థానిక రీజియన్ యూనియన్ బ్యాంక్ సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బి.వి కృష్ణారెడ్డి తెలిపారు.ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఏలూరు రీజియన్ యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎం.జి.కె మూర్తి హాజరై అనంతరం సిబ్బందితోపాటు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంజి కే మూర్తి మాట్లాడుతూ అవినీతిని నిరోధించాలన్న ఉద్దేశంతో విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే ఏలూరులో ఉన్న యూనియన్ బ్యాంకుల శాఖ సిబ్బంది సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన సిబ్బందికి, రెడ్ క్రాస్ సొసైటీకి అభినందనలు తెలియజేశారు. డాక్టర్ ఆర్ ఎస్ ఆర్ కే వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ డిఆర్ఎం రావ్ యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ఇన్సూరెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే తలారి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం లక్ష్మీపురం గ్రామంలో డెంగీ జ్వరం బారిన పడిన వారు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం లో శ్రీఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను గోపాలపురం శాసనసభ్యులు తలారి వెంకట్రావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందచేయాలని వైద్యులకు తెలిపారు. రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపీపీ గంజిమల రామారావు , వైసిపి నాయకులు ఉన్నారు.

దాతల సహాయం అభినందనీయం

విశాలాంధ్ర - కలిదిండి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు సాగర్, వర్మ అన్నారు. శనివారం మండలంలోని తాడినాడ, సున్నంపూడి, దుంపలకోడు దిబ్బ గ్రామాల పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థిని విద్యార్థులకు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిజెపి నాయకులు లావేటి. వీర శివాజీ ఆర్థిక సహకారంతో లాంగ్ నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ దాతలు అందించిన సహాయమును విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చేసుకోవాలని సూచించారు. అనంతరం వీర శివాజీ మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చంటి, అక్బర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విజయబాబుకు అభినందనలు

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పి.వి.విజయబాబును నియమించిన సందర్భంగా వారిని జిల్లా రచయితల సంఘం తరుపున అభినందనలు తెలియజేశారు. తెలుగు జాతి ప్రజల జన్మస్థలమైన ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు భాషను బోధనా,పాలనా, న్యాయ భాషగా గుర్తింపును తీసుకువచ్చి, కచ్చితంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, ప్రభుత్వ ఉత్తర్వులలోనూ తెలుగును ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నాగాస్త్ర, కోశాధికారి లేళ్ళ వెంకటేశ్వరరావు కోరారు.

డాక్టర్ పద్మనాభ మృతి సేవా రంగానికి తీరని లోటు

విశాలాంధ్ర - ఏలూరు : లయన్స్ జిల్లా 316 జి పూర్వ గవర్నర్ ,సేవా తత్పరులు, మానవసేవయే మాధవ సేవగా భావించి పేద ప్రజలకు కంటిచూపు అందించడంలో లయన్స్ సంస్థ ద్వారా సేవా మూర్తిగా వెలుగొందిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ మానం అనంత పద్మనాభం మరణం సేవా రంగానికి తీరని లోటని లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ వి కే పంకజాక్షన్ అన్నారు. డాక్టర్ పద్మనాభం హేలాపురి లయన్స్ భవన ఆవరణంలో ఉన్న నేత్ర వైద్యశాలకు అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అందుకే వారి పేరు మీద హేలాపురి లయన్స్ కాంప్లెక్స్ నందు డాక్టర్ మానం అనంతపద్మనాభం విజన్ సెంటర్ ని ఈ సంవత్సరం ప్రారంభించి సేవలందిస్తూ వారి పేరును చిరస్థాయిగా నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. లయన్స్ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వల్లెపు వెంకటస్వామి, మద్దుకూరి శ్రీహరి , కోశాధికారి చిట్టూరి శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలి



విశాలాంధ్ర- కాళ్ళ : లేబర్ కోడ్ ను రద్దు చేయాలని సిఐటియు కాళ్ళ మండల మహాసభ డిమాండ్ చేసింది. శనివారం కాళ్ళ శివాలయంలో జరిగిన సీఐటియు మహాసభలో మండా సూరి బాబు, దాసరి వెంకటేశ్వరరావు, దావులూరి మారతమ్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు ఈ మహాసభ కి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జేఎన్ వి గోపాలన్ హాజరై మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం కార్మికులు అనేక శతాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ వాటి స్థానంలో మూడు లేబర్ కోడ్ లు తీసుకొస్తుందని దీని వల్ల కార్మికుల హక్కులు హరించబడతాయని కార్మికులు మరింత బానిసలుగా తయారవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చట్టం చేయాలని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కార్మిక కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో నాయకులు రామనాథం అమరావతి పసుపులేటి సత్యనారాయణ పిసిని పైడితల్లి ఉన్నమట్ల రజిని పి ఝాన్సీ యడవల్లి చేంద్రావతి పాల్గొన్నారు. ఈ మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు, ఉపాధ్యక్షులుగా దావులూరి మారతమ్మ, సహాయ కార్యదర్శిగా దాసరి వెంకటేశ్వరరావు, 12 మందితో కమిటీ ఏర్పడింది.

వెనుకబడిన కులాల అభివృద్ధికి టీడీపీ పెద్దపీట



విశాలాంధ్ర -భీమవరం: వెనుక బడిన కులాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందని ఎన్టీఆర్ బీసీలకు పెద్దపీట వేశారని టీడీపీపశ్చిమగోదావరి అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. టీడీపీ బీసీ సాధికార కమిటీలో పదవులు లభించిన కార్యవర్గ సభ్యులు ఆమెను భీమవరంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యధిక శాతం రిజర్వేషన్ కల్పించి బిసిలకు స్వావలంబన కల్పించిన ఘనత టీడీపీదన్నారు.

కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ వేండ్ర శ్రీనివాస్, టిడిపి బీసీ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు వీరమల్లు సూర్యచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి కట్టా రాంబాబు, శెట్టిబలిజ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు కడలి మోహన్ వెంకటశివమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు వీరవల్లి శ్రీనివాస్, గూడాల శ్రీనివాస్, పీతాని మోహనరావు, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కట్ట ఈశ్వరప్రసాద్, నీలాతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ శేషుబాబుకు అభినందనలు

విశాలాంధ్ర - పాలకొల్లు: వైసీపీ ఉండి నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన వైసీపీ రాష్ట్ర రాజకీయ సలహా మండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మేకా శేషుబాబును, శనివారం పాలకొల్లు లోనే ఆయన స్వగృహంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డెటి సూర్యనారాయణ స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీటీసీ కర్ని జోగయ్య, పీతల స్వామి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ ఆడిటోరియంకు శంకుస్థాపన

విశాలాంధ్ర - నరసాపురం : పురపాలక సంఘం కార్యాలయం ప్రక్కన ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రాంగణంలో రూ.1.99 కోట్లతో నిర్మించే ఓపెన్ ఆడిటోరియంకు శనివారం జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి , ప్రభుత్వ చీఫ్ విఫ్ , శాసన సభ్యులు ముదునూరి ప్రసాద రాజు కలసి భూమి పూజ చేసి , శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మున్సిపాలిటి ఆధ్వర్యంలో తొలి విడతగా రూ. 2 కోట్లతో నిర్మాణం అవుతున్న ఓపెన్ ఆడిటోరియం పట్టణంలో అందరికీ , తీర ప్రాంత వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లా దుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ ఓపెన్ ఆడిటోరి యం రూపు దిద్దుకుంటుందన్నారు. 3 నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. 1000 మందికి పైగా పట్టే విధంగా నిర్మించి , పట్టణానికి ఆధునాతన మైన ఓపెన్ ఎయిర్ థియేటరు నిర్మించుటకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు యం.సూర్య తేజ, ఏయంసి చైర్మన్ గుబ్బల రాధా కృష్ణ, పురపాలక సంఘం చైర్పర్సన్ బర్రి వెంకట రమణ, వైస్ చైర్పర్సన్ కామన నాగిని,పురపాలక సంఘం కమీషనరు సిహెచ్.శ్రీనివాస్, తహశీల్దారు యస్ యం. ఫాజిల్ , వివిధ శాఖలు అధికారులు, పలువురు కౌన్సిలర్స్, తది తరులు పాల్గొన్నారు.

మానవత సహాయం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మలకపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు భోజన ప్లేట్లను అందజేసినట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వర రావు తెలిపారు. విద్య, వైద్యం, ఆరోగ్యం విషయాల్లో సాయం అందజేయుటలో సంస్థ ముందుంటుందని అన్నారు. ఆపదలో ఉన్న పేదవారు తమ సంస్థను సంప్రదిస్తే తగు సాయం అందిస్తామని తెలిపారు. ఐ ఐ టి, ఎం బి బి ఎస్ బిట్స్ పిలానీ వంటి సంస్థల్లో చివరి ఏడాది విద్యనభ్యసిస్తూ మెరిట్ ద్వారా క్యాంపస్ ఉద్యోగాలు పొందినవారికి 25 వేల రూపాయల చెక్ లను అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల కార్యదర్శి సాయన సుబ్బారావు సంస్థ మండల కన్వీనర్ గెద్దం సాయిబాబా , సంస్థ మండల పూర్వ అధ్యక్షులు అప్పన చంద్రధర గుప్త సంస్థ మండల ఈసీ మెంబర్ సనపల రాజశేఖర్, సంస్థ సభ్యులు నరాలశెట్టి నారాయణమూర్తి , పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జార్జ్ మాస్టర్ ఇకలేరు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం శివారు వెంకటకృష్ణపురం గ్రామం చిన్నం జార్జ్ మాస్టర్ శనివారం మృతి చెందారు.ఆయన ఉపాధ్యాయ వృత్తి 38 సంవత్సరాలు చేపట్టి రిటైర్మెంట్ అయిన తర్వాత అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అక్షర దీక్ష, ఆర్ఎంపీ డాక్టర్ గాను, వృద్ధాశ్రమ నడపడం, పేద ప్రజలు ఎందరినో చదివించారు. ఇలా అనేక సేవ కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొంది ఉన్నారు, ఆయనకు ఐదు కుమారులు. ఆయన మృతి పట్ల వెంకటకృష్ణాపురం, బ్రహ్మానందపురం, రామన్నగూడెం ప్రజలు ఆయనకు నివాళులర్పించారు. ఉంగుటూరు మండల జెడ్పీటీసీ కోరిపల్లి జయలక్ష్మి , వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల గోపి, గంజి ప్రభాకర్, గంజి రవి, నత్త వెంకటేశ్వరరావు, సలగాల భాస్కర్ రావు , ఆయన మృతి పట్ల పలువురు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర- తణుకు : క్రీడలు విద్యార్థులలో మంచి మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని స్థానిక మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తణుకు ప్రభుత్వ కళాశాలలో గురువారం, శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆటలపోటీల్లో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు 45 మంది పాల్గొనగా 36 మంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్బంగా స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. రానున్న రోజుల్లో ఎక్కువ మంది విద్యార్థులు పోటిల్లో పాల్గొని విజేతలు కావాలని ఆకాంక్షించారు. విజయం సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

గుమ్మం వద్దకే వైద్య సేవలు

విశాలాంధ్ర - కరప : ప్రజల గుమ్మం దగ్గరకే వైద్య సేవలు కార్యక్రమాన్ని శనివారం వేలంగి గ్రామంలో సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలిమ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజల గుమ్మం వద్దకే వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. 1.145 ఆరోగ్య కేంద్రాలతో కలిపి కుటుంబ వైద్యులు భావనను అమలు చేయడానికి 89.75 కోట్ల రూపాయలను ప్రస్తుతం ఉన్న 676 మొబైల్ మెడికల్ యూనిట్లతో పాటు మరో537 కొత్తమొబైల్ మెడికల్ యూనిట్లను కొనుగోలు చేయుట జరిగిందని ఆమె తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ఇద్దరు డాక్టర్లు తప్పనిసరిగా ఉండి నెలలో రెండు రోజులు ఆ పిహెచ్‌సి పరిధిలో ఉన్న గ్రామాలలో వైద్య సేవలు అందించడం జరుగుతుందని సర్పంచ్ నీలిమ రాజేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జీలకర్ర దుర్గారావు, పాతూరి వీరన్న చౌదరి, గరగజిమ్మి, సానా శ్రీను, మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన ఎంపీ శ్రీధర్

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ బాబు శనివారం జంగారెడ్డిగూడెం మండలంలో, పట్టణంలో పలువురి నాయకుల కుటుంబాలను పరామర్శించారు.ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని వచ్చిన చింతలపూడి శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజాను పట్టణంలోని ఆయన ఇంటివద్ద పరామర్శించారు. ఎమ్మెల్యే ఎలీజా ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని తాడువాయి గ్రామంలో నిర్మాణం జరుగుతున్న జగనన్న కాలనీల పనులను పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నవారిగూడెం వైసీపీ నాయకుడు సత్రం వెంకటరావు, ఏ పోలవరం సర్పంచ్ బుద్దాల రాజు, లను పరామర్శించారు. వేగవరం గ్రామం లోని వైసీపీ సీనియర్ నాయకులు నులకాని వీరాస్వామి నాయుడు తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను, పరామర్శించారు.ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శ్రీనివాసపురం సర్పంచ్ యడ్లపల్లి దుర్గారావు కుటుంబ సభ్యులను, వైసీపీ సీనియర్ నాయకుడు మల్లి బాబు తండ్రి శంకర్రావు కొద్దిరోజుల క్రితం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.పట్టణంలో 3వ వార్డులో వాలంటరీ గా పనిచేస్తున్న దుర్గ అకాలంగా మరణించడంతో వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజక వర్గ పరిశీలకులు మండవల్లి విజయసారథి(సోంబాబు), జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి,మండల వైసీపీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైసీపీ సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం వాడపల్లి దివ్యక్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల తిరుపతి వాడపల్లి ఏడువారాల వెంకన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులతో ఆలయ ప్రాంగణమంతా దద్దరిల్లింది. రాష్ట్ర నలుమూలల నుంచి ఆ ఏడు వారాల వెంకన్న దర్శించుకోవడం కోసం రాత్రి వేళలో సుదూర ప్రాంతాల నుంచి కొంతమంది భక్తులు నడిచి ఆలయానికి చేరుకున్నారు. వివిధ వాహనాలలో మరికొంతమంది భక్తులు గుడికి వచ్చి దర్శించుకోగా విశిష్ట గోదావరిలో ముందుగా పుణ్య స్నానాలు ఆచరించి గుండ్లు కొట్టించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, పర్యవేక్షకులు ఎం. రాధాకృష్ణ, శ్రీదేవి, సిబ్బంది రామానుజన్, ఆలయ కమిటీ సభ్యులు పి. సురేష్ రాజు, మెర్ల వెంకటేశ్వరరావు, మన్యం భాను, ఏపుగంటి కనకారావు, రొట్టె రాజబాబు, ఆలయ అర్చకులు సిబ్బంది ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్న దానం, ప్రసాదాల పంపిణీ, త్రాగునీరు సరఫరా, తాత్కాలిక టెంట్లు, తదితర ఏర్పాట్లు చేశారు.

సచివాలయ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షునిగా రఘురాం

విశాలాంధ్ర - గండేపల్లి : గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ దారపురెడ్డి తాతాజీ రావు, కాకినాడ జిల్లా ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా జనరల్ సెక్రెటరీ బి. జాన్ క్రిస్టోఫర్, జిల్లా ఈసీ మెంబర్ మధు చరణ్ ఆధ్వర్యంలో గండేపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికై ఒక యూనిటీగా ముందుకు సాగేందుకే ఏర్పాటు చేయడమైనదన్నారు. ప్రతి ఒక్క సచివాలయం కలుపుకుని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. మండల అధ్యక్షులుగా కంటిపూడి రఘురాం, జనరల్ సెక్రెటరీ మద్దిపాటి శ్రీరామ్, మహిళా విభాగ సెక్రెటరీ విజయలక్ష్మి, ట్రెజరర్ కామేశ్వరి తదితర కమిటీ సభ్యులను ఎన్నుకుని ఘనంగా సన్మానించారు. సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

వృత్తి, ఉద్యమం రెండు కళ్లు

విశాలాంధ్ర - గోపాలపురం : వృత్తి, ఉద్యమం రెండు కళ్ళుగా భావించి ఉపాధ్యాయులు న్యాయపరమైన హక్కులు సాధించుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూలులో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవోలు కారణంగా 1500పాఠశాలలు,మూత పడయని రాబోయే రోజుల్లో మరిన్ని బడులు మూసివేత దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఇప్పటికే మూడు కిలోమీటర్ల లోపు ఎలిమెంటరీ పాఠశాలలను హైస్కూళ్లలో కలపడం ద్వారా ఉద్యోగాల సంఖ్యలో భారీ కోత విధించడం జరిగిందని తెలిపారు ఇప్పటికే ఒక లక్ష 80 వేల పోస్టులకు గాను రానున్న కాలంలో ఒక లక్ష 20 వేలకు దింపు దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు తెలంగాణ రాష్ట్రంతో పోల్చితే మన రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు డిఏ చాలా తక్కువగా వస్తుందని వివరించారు . ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఏ జాన్ బాబు సిహెచ్ వెంకటేశ్వరరావు టీవీ సత్యనారాయణ ఎం నాగేశ్వరరావు ఎస్ సి హెచ్ రతనకుమారి ఝాన్సీ రాణి వి ఎస్ ఆర్ కె ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర - కిర్లంపూడి : 40 నెలల వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని రాష్ట్ర తెలుగుదేశం ఉపాధ్యక్షులు, జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం కిర్లంపూడి మండలం ముక్కొల్లు, రామకృష్ణాపురం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశాలు కిర్లంపూడి మండలం టిడిపి

అధ్యక్షులు చదరం చంటిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ బలోపేతానికి పలు సలహాలు, సూచనలు అందజేసారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 40 నెలల పరిపాలనలో ఎక్కడా ఒక సాగునీటి ప్రాజెక్టు గానీ, రాజధాని అమరావతి గాని, విద్యార్థులకు ఉపయోగపడే యూనివర్సిటీలు గానీ, నిరుద్యోగులకు ఉపయోగపడే పరిశ్రమలు గానీ తీసుకు రాలేదని ఆయన ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో మన గ్రామాల్లో చేసిన సిమెంట్ రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంపన సీతారామచంద్ర వర్మ, టిడిపి నాయకులు బస్వా వీరబాబు, ముక్కోలు సర్పంచ్ జ్యోతుల రాంబాబు, కర్రి రాజా, తోట వెంకటరమణమూర్తి, రామకృష్ణాపురం సర్పంచ్ కంటా సరస్వతి, కంటా శ్రీను, గంధం ఈశ్వరరావు, గోడే దొరబాబు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - తుని : మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రోడ్లు భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతా అధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం స్థాయి ప్రజా ప్రతినిధులు, వైసీపీ కార్యకర్తలు భారీగా హాజరుకాగా మంత్రి దాడిశెట్టి ఎంపి గీత నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబును కమిటీ సభ్యుల్ని అభినందిస్తూ పూలమాలలతో సత్కరించారు. రైతులకు మెరుగైన సేవలందించాలని మంత్రి రాజా ఎంపి వంగా గీత అన్నారు. నూతన కార్యవర్గాన్ని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబును మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి బాలు, నియోజకవర్గ వైసీపీ యువత కన్వీనర్ ఏలూరి బాలు, జెడ్పీటీసీ పోతల సూర్యామణి, తుని ఎంపిపి బొప్పన రాము, వైసి ఎంపిపి చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జడ్ఆర్‌యుసిసి మెంబర్ బోడపాటి శ్రీను, తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పంతగాని వెంకన్న తెలిపారు. శనివారం స్థానిక సూర్య ఎలక్ట్రానిక్స్ ఆవరణలో క్లబ్ అధ్యక్షులు బవిరిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జోన్ చైర్మన్ పంతగాని వెంకన్న మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలోని రాములమ్మ చలక, బవిరిశెట్టి మురళీకృష్ణ ఇంటి వద్ద కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. నిడదవోలు లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తామన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తామన్నారు. సేవా రంగంలో లైన్స్ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 50 వేలకు పైగా క్లబ్బులు, సుమారు 14 లక్షల మందికి పైగా సభ్యులు కలిగిన ఏకైక సేవా సంస్థ లైన్స్ క్లబ్ మాత్రమే చెప్పారు. అవసరమైన వారికి సేవలందించేందుకు లైన్స్ క్లబ్ సభ్యులు ఎప్పుడు ముందంజలో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు భవిరిశెట్టి మురళీకృష్ణ, కోశాధికారి కొండపల్లి పండు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ మద్దిపాటి నాగేశ్వరరావు, నాయకులు ఉక్కుర్తి సీతారాం, రాజన సత్యనారాయణ (పండు), నంగులూరి జగత్ కుమార్, కన్నం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పట్ల అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - భీమవరం : సమాచార హక్కు చట్టం 2005 పై పిఐఓలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారి దాసి రాజు సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా జవాబు దారి తనంతో పని చేసేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల అవినీతి పెరిగిపోతుందని దానిని అరికట్టేందుకు సమాచార హక్కు చట్టం 2005 ఉపయోగ పడుతుందన్నారు.ప్రభుత్వ విధానాలను సక్రమంగా అమలు చేసేందుకు , అధికారులు జవాబుదారితనంతో పనిచేసేందుకు సమాచార హక్కు చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజల కోరిన సమాచారం అందించక పోయినట్లు అయితే శిక్షించబడతారన్నారు. సమాచార చట్టం ద్వారా ఏ విధమైన సమాచారం పొందవచ్చు ఏ ఏ సమాచారం ఇవ్వాలి ఏ విధంగా ఇవ్వాలి సెక్షన్ల వారీగా పిఐఓలకు, ఏపీఐవోలకు దాసి రాజు వివరించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ వై. దుర్గా కిషోర్ , సమాచార హక్కు చట్టం యాక్టివిస్టులు దేవరపల్లి రమణమూర్తి , బెజవాడ దుర్గాప్రసాద్, బి హెచ్ సుమిత్రానందన్ , కె. రవికుమార్, పిఐఓ లు, ఏపీఐవోలు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌తో పేదలకు ఉచిత భోజనం

విశాలాంధ్ర - గోపాలపురం : నందమూరి తారక రామారావు ఆశయాలకు అనుగుణంగా పేద వాడు అన్న క్యాంటీన్ ద్వారా భోజనం చేయడమే నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని మండల టిడిపి అధ్యక్షులు రొంగల సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక తేదేపా నాయకుడు మద్దిపాటి వెంకట నాగ రాజేష్ ఆర్థిక సౌజన్యంతో.అన్నా క్యాంటీన్ చెక్ పోస్ట్ సెంటర్ ఏరియాలో ఏర్పాటుచేసి పేదలకు ఉచితంగా అన్నదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. నవంబర్ నెలలో ప్రతిరోజు ఎన్టీఆర్ అన్న క్యాంటీన్లు ఉచిత భోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు మండలంలోని ప్రముఖ నాయకులందరూ విరాళాలు సేకరించి నవంబర్ నెల నుండి ఉచిత భోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార మహిళప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, కొటారు విజయలక్ష్మి కో రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి కోటారు గాంధీ చదలవాడ ప్రసాద్, మేన్ని.సుధాకర్ మెయిన్ సుధాకర్, జె.శ్రీధర్,ముప్పిడి అశోక్, నందమూరి సత్యనారాయణ, గంద్రోతు. శ్రీనివాసరావు, ఉండవల్లి. రత్నకుమారి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ కమిటీల ప్రెసిడెంట్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి వీల్ చైర్ బహూకరణ

విశాలాంధ్ర - పాలకొల్లు: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వీల్ చైర్ ను బహూకరించారు. ఈ సందర్భంగా పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అడ్వైజరి కమిటీ మెంబర్ చెన్ను విజయ్ మాట్లాడుతూ, హాస్పిటల్ కు వచ్చే పేషెంట్ల సౌకర్యార్థం వీల్ చైర్ ను బహుకరించడం చాలా అభినందనీయ మన్నారు. భవిష్యత్తులో రోగులకు అవసరమైన మౌలిక వసతులను దాతల ద్వారా సమకూర్చి హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్, సెక్రెటరీ జక్కంపూడి మదన్, ట్రెజరర్ కానూరు ప్రభాకర్, పచ్చి ఆవుల రవి, ఇనుకొండ శేషాద్రి, కుంపట్ల రాజా, రేపూరి సూర్యనారాయణ, పోకల సాయి, గాది ఆంజనేయులు, కనకరాజు, సూపరింటెండెంట్ గంటా ప్రభాకర్, నర్సింగ్ పర్యవేక్షకులు విజయ కుమారి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు లక్ష విరాళం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నిత్యాన్నట్రస్టుకు ఒక భక్తుడు రూ.1,01,116లు విరాళం అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాదికారి వేండ్ర త్రినాధరావు పేర్కున్నారు. ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన ఇదుముడి శ్రీను దంపతులు పైవిరాళాన్ని శనివారం ఏఈవో మెట్టపల్లి దుర్గారావుకి అందజేశారు. ఈసందర్భంగా దాత దంపతుల్ని అభినందించి వారికి అన్నదాన బాండ్‌ను అందజేశారు.

నాగుల చవితి వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : పవిత్ర కార్తీక మాసంలో చవితి తిథినాడు వచ్చే నాగుల చవితి పండగ ను భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. పొలాల్లో వెళ్లి పుట్టల దగ్గర పరిసరాలను పరిశుభ్రం చేసి నాగులకు గుడ్లను, పండ్లను పుట్టలో వేసి తమ భక్తిని చాటుకున్నారు. నాగుల చవితి రోజున పూజలు నిర్వహిస్తే దోషం పోతుందని నమ్మకంతో భక్తులు విశ్వాసంతో ఈ నాగుల చవితి పండుగను ఘనంగా నిర్వహించారు.